క్లుప్తంగా

ఉద్యాన పంటలతో అదనపు ఆదాయం



పొలంలో నిమ్మచెట్లు నాటుతున్న రైతు

దొర్నిపాడు: ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారని.. రైతులు ముందుకు రావాలని ఏపీఓ గంగన్న కోరారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో శనివారం ఇంద్ర శివరామిరెడ్డి అనే రైతు మూడెకరాల్లో నిమ్మచెట్లను నాటించారు. ఎకరానికి 110 మొక్కలు ప్రభుత్వమే సరఫరా చేస్తుందని.. అంతేగాక ఖర్చుల కోసం నెలకు రూ.3,600 ఇస్తుందన్నారు. ఇలా మూడేళ్ల పాటు అందిస్తుందని.. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యాన పంటలతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ బషీర్, ఫీల్డ్ అసిస్టెంట్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక మాస పూజలు



అభయాంజనేయస్వామికి పూజలు

ఉయ్యాలవాడ: కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, శ్రీలక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామికి అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్ శర్మ, అనంతయ్యలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అదనపు కన్వీనర్‌గా దస్తగిరి



చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కదిరి దస్తగిరిని భారతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ అదనపు కన్వీనర్‌గా నియమిస్తూ ఐహెచ్ఆర్‌పీఎఫ్ చైర్మన్ బమ్మిడి కేశవరావు ఆదేశాలు జారీ చేశారు. ఈయన గతంలో నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు.

ర్యాగింగ్ జోలికెళ్లొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నంద్యాల(న్యూటౌన్): జూనియర్ విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేయడం సరికాదని మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ఆర్‌జీఎం ఇంజినీరింగ్, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్, ర్యాగింగ్, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది సమాన హక్కులు కల్పించడమన్నారు. ర్యాగింగ్‌తో విద్యార్థుల జీవితాలు నాశనమవుతాయని, కావున దాని జోలికెళ్లొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా వారి మాయలో పడి మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు.

క్రాప్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పంట కోత ప్రయోగంలో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని దిగుబడుల ఆధారంగా వచ్చే క్రాప్ ఇన్సూరెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. నంద్యాల మండలం ఊడుమాల్పురం గ్రామంలో ఏఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో వరిలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ఆధారంగా పంట దిగుబడులు తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా వరిలో పంట కోత ప్రయోగం చేయగా 17.350 కేజీల దిగుబడులు వచ్చింది. దీని ప్రకారం ఎకరాకు 28.1 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఏఓ ప్రసాదరావు తెలిపారు.

- ప్రారంభమైన వరి కోతలు
- తుపాన్ హెచ్చరికలతో ఆందోళన
- కల్లాల్లోనే ధాన్యం

రైతుల్లో 'ఫెంగల్' అలజడి



పెద్దయమ్మనూరులో మొక్కజొన్న, వరి ధాన్యాలపై కప్పిన పట్టలు



చింతకుంట్ల సమీపంలో వరి ధాన్యాన్ని ఆరబోసిన రైతులు



బోడెమ్మనూరులో నేలవాలిన వరిపంట

గోస్పాడు: ఫెంగల్ తుపాను హెచ్చరికలతో రైతుల్లో గుబులు రేకెత్తుతోంది. ఇప్పటికే ఖరీఫ్ పంటలు సరైన దిగుబడులు రాక నష్టాలు మూటగట్టుకున్నారు. ఖరీఫ్‌లో భాగంగా కోత దశలో ఉన్న వరి పంట నేలవాలే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. ఇక కొందరు కోత పనులు చేపడుతుండగా, మరి కొందరు కోసి ధాన్యం ఎండబెట్టేందుకు అనువైన వాతావరణం లేకపోయింది. తుపాను హెచ్చరికలు అన్న దాత గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నాయి. తుపాను ప్రభావం వల్ల శనివారం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులు, మేఘాలు కమ్ముకోవడంతో వర్షం పడుతుందేమోనని ఆరబోసిన ధాన్యాన్ని పట్టలతో కప్పివేశారు. ఇక నూర్పిడికి సిద్ధమవుతున్న రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

దిగుబడులు అంతంతమాత్రమే...

మండలంలో4,381 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా 4,285 హెక్టార్లలో వరి పంట సాగైంది. ముందస్తుగా సాగు చేసిన రైతులు కోత పనుల్లో ఉన్నారు. సాగైన పంటలో 50 శాతం నూర్పిళ్లు పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు. అయితే ఆయా ప్రాంతాల తీరును బట్టి బట్టి 30 నుంచి 35 బస్తాలు (బస్తా 75 కేజీలు) బస్తాల దిగుబడి లభిస్తోంది. పంట సాగుకు ఎకరాకు రూ. 30వేలకు పైగా ఖర్చు చేశారు. పైరు కోతకు వచ్చాక తుపాను విపత్తు తలెత్తుతుందని వాతావరణ శాఖ హెచ్చరికతో పాటు చిన్నగా చినుకులు రాలుతుండటంతో పంట తడిస్తే నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో నష్టమే..

ఈ సమయంలో తుపాను వల్ల వర్షాలు కురిస్తే నష్టపోతామని రైతులు వాపోతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో యంత్రాల ద్వారా కోతలు జోరుగా సాగుతున్నాయి. కానీ తుపాను ప్రభావం వల్ల వర్షాలు కురిస్తే పంట దెబ్బతినడమే కాకుండా యంత్రాలు, కోతలు నిలిచిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే జరిగితే కూలీల కొరత ఏర్పడి కోతల ఖర్చు రెట్టింపవుతుందని వారు కలవరపడుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల వరిపైరు నేలవాలి ఆర్థికబారం పెరిగిందని చెబుతున్నారు.

ఉయ్యాలవాడ: ఫెంగల్ తుపాన్ అన్నదాత గుండెల్లో దడ పుట్టిస్తోంది. శనివారం ఉదయం మండలంలో ఈదురు గాలులు వీస్తూ చిరుజల్లులు కురిశాయి. కంకి దశలో ఉన్న వరి పంట నేలవాలింది. పంటను పరిశీలించేందుకు పొలాలకు వెళ్లిన రైతులు ఆందోళన చెందారు. వారం నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. కోత దశకు వచ్చిన వరి నేలవాలడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట నూర్పిడి చేసిన వరి దిగుబడులను కళ్లాల్లో, రహదారుల వెంట ఆరబెట్టుకున్నారు. వర్షం కురుస్తుండడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాత పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. అలాగే మినుము, పత్తి, మొక్కజొన్న, పప్పుశనగ సాగు చేసిన రైతులదీ అదే పరిస్థితి. నేలవాలిన వరిని కోత కోసేందుకు కష్టంగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

"దిగుబడులు సరిగా రాలేదు



వరిపైరు సాగుకు వేలాది రూపాయలు ఖర్చుచేశాం. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ ప్రబావం ఏర్పడింది. వాతావరణం చల్లబడి వర్షప్రభావం ఏర్పడంతో ధాన్యంలో ఉన్న తేమ ఆరేందుకు కూడా వీలుకాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే దిగుబడులు సక్రమంగా రాకపోగా రైతులు పండించిన ధాన్యానికి మార్కెట్‌లో మంచి ధరలేక అవస్థలు పడుతున్నాం. ఉన్న పైరును ఇంటికి చేర్చుకోలేక పోతున్నాం.

–మద్దిలేటి, రైతు, జిల్లెల్ల

"కోతలు ఆలస్యం చేయాలి



వరికోతలు ఇప్పటికే 50 శాతం పూరయ్యాయి. తుఫాన్ ప్రభావం ఉన్నందున కోతలు ఆలస్యం చేయడం అన్ని విధాలా మంచిది. వాతావరణం, పరిస్థితులు అనుకూలంగా ఉన్నంత వరకే రైతులు ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకోవాలి. చేల మీద ఉన్న పైర్లను పరిస్థితికి అనుగుణంగా పనులు చేసుకోవాలి. సురక్షిత ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించి, ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. ధాన్యాన్ని గోడౌన్లలో భద్ర పరుచుకోవాలి.

–స్వప్నికారెడ్డి, వ్యవసాయాధికారి, గోస్పాడు

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



ఉప కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో జీవించడానికి ప్రయత్నించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలావెంకట శేషాద్రి అన్నారు. శనివారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత ఉన్న ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట జైలు అధికారి శల్వంత్, న్యాయవాదులు షహీనా, మెడికల్ ఆఫీసర్ నాగమస్తాన్ ఉన్నారు.

సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల సబ్ జైల్‌ను కర్నూలు డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి నీలా వెంకట శేషాద్రి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి జైలు పరిసరాలు, ఖైదీల గదులు, వంట గది, బాత్రూంలను పరిశీలించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి వారి ఆరోగ్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని వారి కుటుంబాల గురించి ఆలోచించాలని సూచించారు. ఎవరి తరఫునైనా కేసు ఉచితంగా వాదించడానికి ప్రభుత్వం ప్రత్యేక న్యాయవాదిని నియమించిందని చెప్పారు. జైలు సూపరింటెండెంట్ గురుప్రసాద్, కోర్టు సిబ్బంది రామచంద్రారెడ్డి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

జూపాడుబంగ్లా: ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా క్రీడలశాఖ అధికారి రాజు తెలిపారు. మండల కేంద్రం జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ గంగాధర్ ఆసుపత్రిలో లేకపోవడంతో ఆరా తీశారు. వైద్యసిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఎంత మంది సెలవుల్లో ఉన్నారంటూ సూపర్‌వైజర్ రాముడును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ఎక్కడ నివాసం ఉంటున్నారని ప్రశ్నించగా నందికొట్కూరులో ఉంటున్నారని వైద్యసిబ్బంది తెలిపారు. అనంతరం వచ్చిన డాక్టర్ గంగాధర్ ఎక్కడి వెళ్లారు సార్ అని ప్రత్యేకాధికారి రాజు ప్రశ్నించగా తంగడంచకు ఫీల్డ్ వెరిఫికేషన్ వెళ్లాలని తెలిపారు. మీరు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదనే ఆరోపణలున్నాయని, జాగ్రత్తగా విధులు నిర్వర్తించకపోతే కలెక్టర్ ఉపేక్షించరని హెచ్చరించారు. కేజీ రోడ్డు నుంచి ఆసుపత్రి వరకు వీధిదీపాలు ఏర్పాటు చేయించాలని వైద్యసిబ్బంది కోరగా వెంటనే కార్యదర్శి తిప్పన్నను పిలిపించి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మందుల గడువుతేదీలను పరిశీలించారు. సర్పంచ్ మొట్టెబాలయ్య, కార్యదర్శి తిప్పన్న పాల్గొన్నారు.

నాపరాళ్ల ట్రాక్టర్ బోల్తా

కొలిమిగుండ్ల: స్థానిక అంకిరెడ్డిపల్లె ప్రధాన రహదారిలోని సెల్ టవర్ సమీపంలో శనివారం నాపరాళ్ల ట్రాక్టర్ బోల్తా పడింది. కనకాద్రిపల్లె సమీపంలోని గనుల్లోంచి నాపరాళ్లను లోడ్ చేసుకుని తాడిపత్రికి బయలు దేరింది. అంకిరెడ్డిపల్లె వద్దకు చేరుకోగానే టైర్ పగలి అదుపుతప్పి రోడ్డు పక్కన ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాద తీవ్రత తప్పింది.

యువకుడి అదృశ్యం

మహానంది: మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన షేక్ అజీజ్ గత మూడు రోజుల నుంచి కనిపించడం లేదని తండ్రి షేక్ మహబూబ్ హుసేన్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ముగిసిన కార్తీకమాస ఉత్సవాలు



మహానందిలో మహాపూర్ణాహుతి పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది: మహానంది దేవస్థానంలో కార్తీకమాస ఉత్సవాలు శనివారం ముగిశాయి. స్థానిక యాగశాలలో మహాపూర్ణాహుతి పూజలతో ఉత్సవాలు ముగియగా రాత్రి అభిషేకం మండపంలో శాంతి కల్యాణోత్సవం కమణీయంగా సాగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ, రుత్వికులు, పండితులు పూజలు చేపట్టారు.

కామేశ్వరీదేవికి లక్ష కుంకుమార్చన

కార్తీకమాసం, అమావాస్యను పురస్కరించుకుని మహానందిలోని శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా జరిగాయి. నంద్యాలకు చెందిన రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతుల సహకారంతో వరుసగా 40వ ఏడాది లక్ష కుంకుమార్చన పూజలు జరిగాయి.

భక్తజనసందడి

కార్తీకమాసం, అమావాస్య, వీకెండ్ సందర్భంగా మహానంది ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది.

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరం వద్ద ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉమామహేశ్వరాలయంలో శనివారం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ రోజు కార్తీక బహుళ అమావాస్య పూజలు నిర్వహించారు. భక్తులు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకాలు చేశారు. అదేవిధంగా లలితాదేవి అమ్మవారికి భక్తులు రుద్రాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు కూష్మాండ దీపోత్సవం, గుమ్మడికాయ దీపోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

మినీ గోకులం షెడ్డు ప్రారంభం

ఉయ్యాలవాడ: మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో రూ. 2.30 లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును శనివారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందుగానే పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, ఏడీఏ వరప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

రుద్రవరం: మహిళను తప్పించబోయి బైక్ నుంచి కిందపడి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం రుద్రవరం మండల పరిధిలోని రెడ్డిపల్లె మెట్ట వద్ద చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పెద్ద ముడియం గ్రామానికి చెందిన రమేష్ బైక్‌పై పెద్దకంబలూరు గ్రామానికి వెళ్లాడు. అక్కడ వ్యక్తిగత పనులు పూర్తి చేసుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలోని రెడ్డిపల్లె మెట్ట వద్ద ఎదురుగా వస్తున్న మహిళను తప్పించబోయి కింద పడి గాయపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): లేట్ బర్త్ సర్టిఫికెట్లకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అపార్ ఐడీ క్రియేట్ చేయడం కోసం స్కూల్ రికార్డ్స్, ఆధార్ అన్నింటిలో ఒకే విధంగా ఉండాలని చెప్పడం తగదన్నారు. ఆధార్‌లో విద్యార్థులు మార్పులు, చేర్పులు చేసుకోవాలంటే బర్త్ సర్టిఫికెట్ కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని సచివాలయాల ద్వారా విచారణ చేయించి బర్త్ సర్టిఫికెట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవడానికి, రూ.110, నోటరీ అఫిడవిట్ చేయించుకోవడానికి రూ.180, నాన్ అవైలబులిటీ కోసం రూ.50 చెల్లించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి బర్త్ సర్టిఫికెట్ల మంజూరులో విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శివకుమార్, సైపుల్లా, వరుణ్, సాయి పాల్గొన్నారు.

మద్దూరు పీహెచ్‌సీ తనిఖీ



మందులను తనిఖీ చేస్తున్న డీఐఓ ప్రసన్న లక్ష్మీ

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు పీహెచ్‌సీని శనివారం డీఐఓ ప్రసన్న లక్ష్మీ తనిఖీ చేశారు. మందుల నిల్వలు, ఇతర రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరచాలని వైద్య సిబ్బందికి సూచించారు. సకాలంలో ప్రజలకు అందించాల్సిన టీకాలు వేసే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీతా, ఎంపీహెచ్ఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 95.49 శాతం పింఛన్ల పంపిణీ



బొమ్మలసత్రంలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని సాయంత్రం 6 గంటల సమయానికి 95.49 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం తెలిపారు. నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సమీపంలో మంచానికే పరిమితమైన బాలుడు హేమంత్, మరొక లబ్ధిదారు గాజుల లక్ష్మీదేవికి పింఛన్ మొత్తాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే అన్ని మండలాల్లో సాయంత్రం 6 గంటల సమయానికి 2,06,836 మందికి రూ.87.49 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేసి 95.49 శాతం పూర్తి చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. పట్టణంలోని 28వ వార్డు నౌమాన్ నగర్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. వేలిముద్రలు పడని వారికి ఐరీస్ ద్వారా అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ తెలిపారు. కానాల గ్రామంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీజీబీని కడపలోనే కొనసాగించాలి

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని గ్రామీణ బ్యాంక్ అసోసియేషన్ యూనియన్ నాయకులు సుజిత్, రవితేజ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రమేష్ కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి వినితి పత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఒకే రాష్ట్రం ఒకే గ్రామీణ బ్యాంక్ ప్రతిపాదనలో భాగంగా రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంక్‌లని కలిపి ఒకే గ్రామీణ బ్యాంక్ చేసే ప్రణాళిక కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మీదట మిగతా మూడు గ్రామీణ బ్యాంక్‌లను రాష్ట్రంలోనే పెద్దదైన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో కలిపే ప్రతిపాదన జరిగిందన్నారు. 18 ఏళ్లుగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ హెడ్ ఆఫీస్ కడపలో ఉందని, అన్ని సౌకర్యాలతో కూడిన అధునాతన హెడ్ ఆఫీస్ బిల్డింగ్‌తో పాటు దక్షిణ భారత దేశంలో ఉన్న ఏకైక కరెన్సీ చెస్ట్ కూడా కడపలోనే ఉందని అలాంటి హెడ్ ఆఫీస్‌ని అమరావతికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, నివారించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటింటికీ చేరని పింఛన్



కొండమాయపల్లెలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దొర్నిపాడు: మండలంలో తొలిరోజు శనివారం 3,669 పింఛన్లకు గాను 3515 మందికి పింపిణీ చేశారు. సాయంత్రానికి 95.80 శాతం పంపిణీ చేసినప్పటికీ కొన్ని గ్రామాల్లో ఒకే ప్రదేశానికి లబ్ధిదారులను పిలిపించుకుని పంపిణీ చేశారు. భాగ్యనగరం గ్రామంలో ప్రతి నెలా ఇలా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల వద్దకు వచ్చి ఇవ్వాలి కాదా అని ప్రశ్నిస్తే సిగ్నల్ సరిగ్గా పనిచేయడం లేదని అందుకే ఒకే ప్రదేశంలో ఇస్తున్నామని చెబుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మరీ గతంలో వలంటీర్లు ఇళ్ల వద్దకు వచ్చే ఇచ్చారు కదా అని అడిగితే సమాధానం లేదు.

రుద్రవరంలో 96 శాతం పింఛన్ల పంపిణీ

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో శనివారం 96 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. కొండమాయపల్లెలో సాగుతున్న పింఛన్ల పంపిణీని ఆమె పరిశీలించారు. ఉదయం నుంచే సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 6255 మంది పింఛన్‌దారులు ఉండగా 6007 మందికి పింఛన్ అందజేసినట్లు వెల్లడించారు.

సేవాభావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ వీర జయలక్ష్మి

మహానంది: విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి సూచించారు. వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడినవారవుతారన్నారు. వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆదర్శ రైతు మాబు ఉసేని పాల్గొన్నారు.

జనవరిలో పెన్షనర్ల అసోసియేషన్ ఎన్నికలు

నంద్యాల(అర్బన్): వచ్చే ఏడాది జనవరిలో పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల పరిశీలకులు మద్దిలేటిరెడ్డి తెలిపారు. 11ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో అసోసియేషన్‌లో గందరగోళం నెలకొందంటూ పలువురు సభ్యులు రాష్ట్ర సంఘానికి ఫిర్యాదు చేయడంతో స్థానిక అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో శనివారం పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా వచ్చిన మద్దిలేటిరెడ్డి, పక్కీర్‌రెడ్డి, నారాయణ అసోసియేషన్ నాయకులతో చర్చించారు. అనంతరం మద్దిలేటిరెడ్డి మాట్లాడుతూ తాలూకా యూనిట్లను జిల్లా యూనిట్‌గా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ప్రకటించారన్నారు. అసోసియేషన్‌లో అక్రమాలు జరగడానికి ఆస్కారం లేదన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు శివనాగిరెడ్డి మాట్లాడుతూ నిబంధనల మేరకే అసోసియేషన్‌ను నడిపామని, ఎక్కడ పక్షపాతం చూపలేదన్నారు. సుబ్బరాయుడు, రాజగోపాల్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం

కోవెలకుంట్ల: స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు యంగ్‌మూడో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అరుణకుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 28న పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన సుష్మ, ఆసియాబేగం, అస్మా, జైష్ణవి బంగారు పతకాలు సాధించారన్నారు. మాధురి, కృపా, చరణ్య, విజయ వెండి పతకాలు, సమీర, షాహిద, శ్రీనిధి, అమిబాబీ, షాబియా రజత పతకాలు కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయినులు అభినందించారు.